ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ 15.01.2026 సమయం. 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. గత ప్రభుత్వం తెలంగాణను అప్పుల రాష్ట్రంగా మార్చారని రాష్ట్ర కార్మిక , గనుల శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి ఆరోపించారు.

2. రాష్ట్ర వ్యాప్తంగా ఈరోజు మకర సంక్రాంతి పండుగను ఆనందోత్సాహాలతో జరుపుకుంటున్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ , ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.

3. రాష్ట్ర ప్రభుత్వం, క్రీడా శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ నిర్వహిస్తున్న రెండో విడత సీఎం కప్ పోటీలు ఎల్లుండి నుండి ప్రారంభమవుతాయి.

4. రాష్ట్రంలో చలి తీవ్రత తగ్గుతోంది. రానున్న మూడు రోజుల్లో రాష్ట్రంలో పొడి వాతావరణం నెలకొంటుందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

<u>సంక్రాంతి:</u>

రాష్ట్ర వ్యాప్తంగా ఈరోజు మకర సంక్రాంతి పండుగను సాంప్రదాయ బద్ధంగా , ఆనందోత్సాహాలతో జరుపుకుంటున్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ సహా పలువురు ప్రముఖులు ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా రాష్ట్ర

ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజాపాలనలో ఈ సంక్రాంతి చరిత్రను తిరగరాసిందని ముఖ్యమంత్రి అన్నారు ఇతర మంత్రులు , నాయకులు రాష్ట్ర ప్రజలకు సంక్రాత్రి తెలిపారు.  కాగా,  పతంగులు ఎగుర వేసేవారు విద్యుత్ ప్రమాదాలకు గురికాకుండా ఉండేందుకు విద్యుత్ తీగలు, ట్రాన్స్ ఫార్మర్లకు దూరంగా గాలిపటాలు ఎగుర వేయాలని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ముషారఫ్ ఫరూఖీ సూచించారు.

-డెస్క్/ఎడిటర్

సంక్రాంతి- జగిత్యాల:

మకర సంక్రాంతి పండుగ సందర్భంగా రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ధర్మపురి శ్రీ లక్ష్మీనరసింహస్వామిని ఈరోజు దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున సంక్రాంతి పండుగ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి రాష్ట్ర ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. తెలంగాణ రాష్ట్రం సశ్యశ్యామలంగా సుభిక్షంగా ఉండాలని కోరుకుంటున్నట్లు తెలిపారు.

-జగిత్యాల జిల్లా, పీటీసీ

సంక్రాత్రి-సిరిసిల్ల:

రాజన్న సిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా సంక్రాంతి పండుగను ప్రజలు ఘనంగా జరుపుకుంటున్నారు. ప్రతి ఇంటి ముందు రంగువల్లులు ఆకట్టుకుంటున్నాయి. గ్రామాల్లో గ్రామపంచాయతీలు, కుల, యువజన సంఘాల ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు... యువతకు గాలిపటాలు , వివిధ క్రీడా పోటీలు నిర్వహిస్తున్నారు.

-పీటీసీ, రాజన్న సిరిసిల్ల

సంక్రాత్రి-జనగామ:

జనగామ జిల్లా ప్రజలు మకర సంక్రాంతి పర్వదినాన్నిను ఘనంగా జరుపుకుంటున్నారు. ఉదయం 5 గంటల నుండే దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఇళ్ల ముందు

రంగుల ముగ్గులతో గొబ్బెమ్మలను అలంకరించారు. పిల్లలు, పెద్దలు పతంగులను ఎగురవేస్తూ పండగ వాతావరణాన్ని ఆస్వాదిస్తున్నారు. క్రికెట్ , కబడ్డీ, ఖోఖో, ముగ్గుల పోటీలను నిర్వహిస్తున్నారు.

- పిటిసి, జనగామ

సంక్రాతి- ఆసిఫాబాద్ :

ఆసిఫాబాద్ జిల్లా వ్యాప్తంగా సంక్రాంతి సంబరాలను ప్రజలు ఘనంగా జరుపుకుంటున్నారు. అసిఫాబాద్ మండలంలో ఎడ్ల బండ్ల పోటీలను నిర్వహించారు. జిల్లా కేంద్రంతో పాటు పలు ప్రాంతాల్లో నిర్వహించిన రంగవల్లుల పోటీలు అందర్నీ అలరించాయి. జైనూర్ లో నిర్వహించిన వేడుకల్లో ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.

-పీటీసీ, ఆసిఫాబాద్

**KITE FEST:**

సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్ లో అంతర్జాతీయ కైట్ అండ్ స్వీట్ ఫెస్టివల్ ఈ రోజుతో ముగియనుంది. సంక్రాంతి సందర్భంగా మూడు రోజులుగా జరుగుతోన్న ఈ పతంగుల పండుగకు ఇవాళ కూడా సందర్శకులు భారీగా తరలి వస్తున్నారు. 19 దేశాల నుంచి సుమారు 40 మంది కైట్ ఫ్లైయర్స్ ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నారు. వారు ఎగురవేస్తున్న వివిధ ఆకృతుల పతంగులు చూపరులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. 60 స్టాల్స్ లో వివిధ రాష్ట్రాలకు చెందిన తీపి వంటకాలు వడ్డిస్తున్నారు. కాగా , పరేడ్ గ్రౌండ్స్ చుట్టుపక్కల ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు కొనసాగుతున్నాయి. పలు మార్గాల్లో వాహనాలను మళ్లిస్తుండగా , మరికొన్ని దారులనున పూర్తిగా మూసివేసారు. సంక్రాంతి పండుగ సందర్భంగా రేపటి నుంచి ఈనెల 18 వరకు హాట్ ఎయిర్ బెలూన్ ఫెస్టివల్... రేపు , ఎల్లుండి గచ్చిబౌలి స్టేడియంలో డ్రోన్ షో నిర్వహిస్తున్నారు. ఈ ఉత్సవాల కోసం అధికార యంత్రాంగం అవసరమైన ఏర్పాట్లు చేస్తోంది.

-డెస్క్/Editor

వివేక్ వెంకటస్వామి:

గత ప్రభుత్వం తెలంగాణను అప్పుల రాష్ట్రంగా మార్చారని రాష్ట్ర కార్మిక , గనుల శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి ఆరోపించారు. మంచిర్యాల జిల్లా క్యాతనపల్లి మున్సిపాలిటీలోని 10 వార్డుల్లో కలెక్టర్ కుమార్ దీపక్ తో కలిసి 5 కోట్ల రూపాయిల వ్యయంతో చేపడుతోన్న అభివృద్ధి పనులకు మంత్రి ఈ ఉదయం శంకుస్థాపనలు , ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ప్రజల ఇబ్బందులను గత ప్రభుత్వం పట్టించుకోలేదని, కమీషన్లు వచ్చే ప్రాజెక్టులకు ప్రాధాన్యతనిచ్చిందని విమర్శించారు. అయితే , కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సంక్షేమే ధ్యేయంగా అనేక పథకాలు ప్రవేశపెట్టి సమర్ధవంతంగా అమలు చేస్తోందన్నారు. సింగరేణి భూముల్లో నిర్మించుకున్న ఇండ్ల స్థలాల పట్టాలకు సంబంధించిన 76 జీవోపై బ్యాన్ ఉందని తెలిపారు. ఈ జీవోను పునరుద్ధరించాలని ఇప్పటికే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , రెవెన్యూ మంత్రులను అభ్యర్ధించినట్లు చెప్పారు. ఇండ్లకు పట్టాలు ఇప్పించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

---సౌండ్ బైట్ :: మంత్రి వివేక్ వెంకటస్వామి ---

-పీటీసీ మంచిర్యాల

సీఎం కప్ :

రాష్ట్ర ప్రభుత్వం, క్రీడా శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ నిర్వహిస్తున్న రెండో విడత సీఎం కప్–2025కు ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. రాష్ట్రస్థాయి వరకు ఐదు అంచెల్లో జరిగే ఈ పోటీలు ఎల్లుండి నుండి ఈనెల 23 వరకు గ్రామస్థాయితో ప్రారంభమవుతాయి. ఇప్పటికే సుమారు 70 వేల మంది క్రీడాకారులు ఆన్‌లైన్‌లో తమ పేర్లను నమోదు చేసుకున్నారు. ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించి , 2036 ఒలింపిక్స్ లో రాష్ట్ర ప్రతిభను చాటాలనే లక్ష్యంతో ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు. గత ఏడాది సీఎం కప్ స్ఫూర్తితో ఈ ఏడాది విస్తృతంగా ఏర్పాట్లు చేసినట్లు తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి అన్నారు.

-PN, SAT

వి బి జీ-రామ్ జీ:

కేంద్ర ప్రభుత్వం దినసరి కూలీల కోసం ప్రవేశపెట్టిన 'వికసిత్ భారత్ గ్యారంటీ పర్ రోజ్ గార్ అండ్ ఆజీ వికా మిషన్ ' పథకం తమకెంతో ఉపయోగకరంగా ఉంటుందని రాజన్న సిరిసిల్ల జిల్లా, చందుర్తి మండలం మల్యాల గ్రామానికి చెందిన దినసరి కూలీ పీసరి వెంకటేష్ చెప్పారు. గతంలో 100 రోజులుగా ఉన్న పని దినాలను 125 రోజులకు పెంచడం ప్రతీ కూలికి లాభ దాయకమని ఆయన అన్నారు. మా ఆకాశవాణి ప్రతినిధితో వెంకటేష్ మాట్లుడుతూ....

--- సౌండ్ బైట్ :: పీసరి వెంకటేష్, రాజన్న సిరిసిల్ల ---

-పిటిసి, రాజన్న సిరిసిల్ల

కొండా సురేఖ:

రాష్ట్రంలో ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. ఐనవోలు మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా మంత్రి మొక్కులు తీర్చుకుని, ప్రత్యేక పూజలు చేశారు. ఐనవోలు ఆలయ అభివృద్ధి కోసం వచ్చే జాతర నాటికి రెండు కోట్ల రూపాయలు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఆలయ సమీపంలో హరిత హోటల్ నిర్మించనున్నట్లు తెలిపారు. జాతర సందర్భంగా ఏర్పాటు చేసిన తాత్కాలిక బస్టాండ్‌ను ఎమ్మెల్యే కేఆర్ నాగరాజుతో కలిసి ఆమె ప్రారంభించారు.

-వరంగల్ పి టి సి

మున్సిపల్ ఎన్నికల రిజర్వేషన్లు:

మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో జనగామ , స్టేషన్ ఘన్పూర్ మున్సిపాలిటీకి సంబంధించిన రిజర్వేషన్లను రాష్ట్ర మున్సిపాలిటీ అడ్మినిస్ట్రేషన్ శాఖ రాష్ట్ర కార్యదర్శి టి. శ్రీదేవి విడుదల చేశారు. జనగామ మున్సిపాలిటీ పరిధిలో మొత్తం 30 వార్డులు ఉండగా వాటిలో ఎస్టీ పురుషుడికి 1, ఎస్సీ పురుషులకు 3 , ఎస్సి మహిళలు 2 , బీసీలకు 9 వార్డులు , అన్ రిజర్వుడు కింద ఆరు వార్డులను కేటాయించారు. స్టేషన్ ఘన్పూర్ మున్సిపాలిటీ పరిధిలో...

ఎస్టీ పురుషుడికి ఒకటి, ఎస్సీ పురుషులకు మూడు, ఎస్సీ మహిళలకు 2, బిసి పురుషులకు 2, బీసీ మహిళలకు 1, జనరల్ మహిళలకు 6, అన్ రిజర్వుడుకు 3 వార్డులను కేటాయిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి.

- పిటిసి జనగామ

వాతావరణం :

రాష్ట్రంలో చలి తీవ్రత తగ్గుతోంది. కొన్నాళ్లుగా తీవ్ర చలిగాలులతో ఇబ్బందిపడ్డ ప్రజలకు మారిన వాతావరణ పరిస్థితులు ఉపశమనం కలిగిస్తున్నాయి. రానున్న 3-4 రోజుల్లో రాష్ట్రంలో పూర్తిగా పొడి వాతావరణం ఏర్పడే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు పేర్కొన్నారు. నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో గరిష్ట ఉష్ణోగ్రతలు 29 డిగ్రీల వరకు పెరిగే అవకాశం ఉందని తెలిపారు. సంగారెడ్డి , కామారెడ్డి జిల్లాల్లో , బీదర్ సరిహద్దు ప్రాంతాల్లో తేలికపాటి వర్షాలు పడే అవకాశం ఉందని వెల్లడించారు.

-PN

ఫ్రీ కోచింగ్:

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాల కోసం నిర్వహించే పోటీ పరీక్షలకు ఐదు నెలల పాటు నిరుద్యోగులకు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు రాజన్న సిరిసిల్ల జిల్లా షెడ్యూల్డ్ కలాల అభివృద్ధి అధికారి రవీందర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని స్టడీసర్కిల్ లో 2025-26 సంవత్సరానికి గానూ పోటీ పరీక్షలకు శిక్షణ పొందే నిరుద్యోగులకు భోజన వసతి , స్టడీ మెటీ రియల్స్ ఉచితంగా ఇస్తామని తెలిపారు. వార్షిక ఆదాయం మూడు లక్షల లోపు ఉండి అర్హత గలవారు ఆన్ లైన్ లో ఈనెల 30వ తేదీలోగా దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. ఫిబ్రవరి 8వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామని చెప్పారు.

- పిటిసి, రాజన్న సిరిసిల్ల

దొంగలు-అరెస్టు:

అంతరాష్ట్ర దొంగల ముఠాలో ఏడుగురు సభ్యులను వరంగల్ సిసిఎస్ , హన్మకొండ కేయూ పోలీసులు అరెస్ట్ చేశారు. వరంగల్ డిసిపి దార కవిత తెలిపిన వివరాల ప్రకారం.... పశ్చిమబెంగాల్ ముర్షిదాబాద్ జిల్లాకు చెందిన ఫిరోజ్ షేక్ మత్తు పదార్థాలకు బానిసై , మరికొందరితో దొంగతనాలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు.

- పి టి సి, వరంగల్ జిల్లా